సింధనూరు ఎమ్మెల్యే ఇంట్లో చోరీకి యత్నం


రాయచూరు, జూలై 19 : నగరంలోని కృష్ణ మెడోస్ లే అవుట్‌లో ఉన్న సింధనూరు ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ నివాసంలో చోరీ యత్నం జరిగింది. ఘటన ఆలస్యంగా వెలుగుచూడగా సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ శుక్రవారం పరిశీలించారు. తాళం వేసిన ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న దొంగలు తాళం విరగొట్టి లోపలికి ప్రవేశించి వస్తువులన్నీ చెల్లాచెదురు చేసి వెళ్లారు. శుక్రవారం ఇక్కడికి వచ్చిన ఎమ్మెల్యే బంధువు అనిల్ వస్తువులన్నీ చెల్లాచెదురై పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెస్ట్ పోలీసులు దొంగల ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రులు లేకుండా సమావేశాలా..?

- వారి గైర్హాజరుపై బీజేపీ, జేడీఎస్ ఆగ్రహం
- పోడియంలోకి దూసుకెళ్లి ఆందోళన
- మంత్రుల నిర్లక్ష్యంపై స్పీకర్ మండిపాటు
- వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై పరిషత్‌లో వాగ్వాదం

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో మంత్రులు లేకపోవడంపై బీజేపీ, జేడీఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కార్యకలాపాలు ప్రారంభం కాగానే బీజేపీ సభ్యుడు బసనగౌడ పాటిల్ యత్నాళ్ మాట్లాడుతూ మంత్రులు లేకుంటే సభలో ఎలా మాట్లాడేదంటూ అభ్యంతరం తెలిపారు. మాజీ మంత్రి అశ్వత్థనారాయణ జోక్యం చేసుకుని 9.45 గంటలకే శాసనసభకు వచ్చామని, ఒక మంత్రి కూడా లేరని, ప్రతిపక్ష సభ్యులు మాత్రమే సభలో కనిపిస్తున్నారని ఇలాగైతే సజావుగా జరిగినట్టేనా..? అని మండిపడ్డారు. ప్రతిపక్ష నేత అశోక్ మాట్లాడుతూ శాసనసభ సమావేశాలు సజావుగా జరగాలని కొత్త నిబంధన తీసుకొచ్చారని, అధికార పార్టీ సభ్యులు, మంత్రులు లేకపోతే ఎలాగని మండిపడ్డారు. పోడియంలోకి దూసుకెళ్లి ఆందోళన చేశారు. స్పీకర్ యూటీ ఖాదర్ అధికార పక్ష సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులకు బుద్ధి ఉండాలని శాసనసభకు సరైన సమయానికి చేరుకోవాలని, మంత్రులు కూడా ఇలా నిర్లక్ష్యం చేయరాదని మండిపడ్డారు. మంత్రులు లేకపోవడంతో పది నిమిషాలు సభను వాయిదా వేశారు. కాంగ్రెస్ పార్టీ విప్ అశోక్ పట్టణ మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు విప్ ఇచ్చామని అందరికీ ఫోన్లు చేస్తున్నామని అన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిపై చర్చించాలంటే మంత్రులు లేకపోవడం ఎంతవరకు సమంజసమని బసనగౌడ పాటిల్ యత్నాళ్ మండిపడ్డారు. 11 గంటల తర్వాత సభను ప్రారంభిస్తే బాగుంటుందని, సాయంత్రం ఎమ్మెల్యేలు అందరూ కలిసేందుకు అనుకూలం ఉంటుందని బీజేపీ సభ్యులు తెలిపారు. సభ అరగంటపాటు గందరగోళంగా సాగింది. పోడియంలో నిరసన విరమించిన ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాట్లాడుతూ యడియూరప్ప, బొమ్మై ప్రభుత్వంలోనూ అవినీతి జరిగిందని జాబితాను విడుదల చేశారు. వీటిలో ఏపీఎంసీ, బోవి అభివృద్ధి మండలి, దేవరాజ్ అరసు ట్రక్, గంగా కల్యాణ కార్పొరేషన్, కియోనిక్స్, కొవిడ్, 40శాతం కమిషన్, ఎస్ఐ నియామకాలలో అక్రమాలు, పరశురామ థీమ్ పార్క్, వ్యవసాయశాఖతో కలిపి 21 అక్రమాలు జరిగాయన్నారు. పరిషత్‌లో కార్యకలాపాలు ప్రారంభం కాగానే వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు సంబంధించి ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌ల నిధులు మింగేశారంటూ ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు.


పరిషత్‌లో ఆసక్తిగా వింటున్న సభ్యులు


శాసనసభ పోడియంలో బీజేపీ సభ్యుల నిరసన

మీ బండారమంతా తెలుసు

- నేను నోరు తెరిస్తే మీరంతా ఆత్మహత్య చేసుకోవాలి
- బీజేపీ సభ్యులపై ఎమ్మెల్సీ పుట్టణ్ణ మండిపాటు



బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'బీజేపీ నిరంతరంగా మాలాంటివారిని దగ్గర ఉంచుకునే అధికారంలోకి వచ్చింది. అక్కడి వారి బండారమంతా నాకు తెలుసు.. నేను నోరు తెరిస్తే... బీజేపీ సభ్యులంతా ఆత్మహత్య చేసుకోవాలి..' అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పుట్టణ్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిషత్‌లో శుక్రవారం వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిపై చర్చలో భాగంగా బీజేపీ సభ్యుల ఆరోపణలపై పుట్టణ్ణ మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్‌ను ఉద్దేశించి నువ్వెంత మాట్లాడినా ఎప్పటికీ మంత్రికాలేవన్నారు. అందుకు ధీటుగా రవికుమార్ కూడా నువ్వు కాంగ్రెస్‌లో మంత్రి కాలేవన్నారు. దీంతో రెచ్చిపోయిన పుట్టణ్ణ బీజేపీలో పరిస్థితి తనకు తెలుసని, అక్కడ ఉండలేకనే కాంగ్రెస్‌కు వచ్చానని అన్నారు. బీజేపీలో తాను చూసిందంతా చెబితే మీరెవ్వరూ ఉండరని, ఆత్మహత్యలు చేసుకుంటారని మండిపడ్డారు. బీజేపీ ఎప్పుడూ సొంతంగా అధికారంలోకి రాదని అన్నారు. అందుకు భారతిశెట్టి జోక్యం చేసుకుని ఇప్పటికే అన్ని పార్టీలకు వెళ్లారని, కాంగ్రెస్ తర్వాత మరే పార్టీ లేదనే పొగుడుతున్నారని అన్నారు.

నాకు చెడ్డపేరు తీసుకురావడమే బీజేపీ లక్ష్యం

- సిట్‌పై సంపూర్ణ విశ్వాసం ఉంది
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అక్రమాలపై దర్యాప్తు సాగుతోందని, అయినా తనకు చెడ్డపేరు తీసుకురావడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. శుక్రవారం విధానసౌధలో సీఎం మీడియాతో మాట్లాడారు. సిట్ దర్యాప్తు చేస్తోందని, దానిపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. అకౌంట్స్ సూపరింటెండెంట్ చంద్రశేఖరన్ ఆత్మహత్య మరుసటి రోజే ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సిట్ ఏర్పాటు చేసి నలుగురు సీనియర్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసి రూ.34కోట్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయం చేస్తున్నాయని, 69వ వాయిదా తీర్మానం కింద 7 గంటలపాటు వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు. కేవలం కాలయాపనకే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్‌కు సంబంధించి రూ. 89.63 కోట్లను ఎంజీ రోడ్డు యూనియన్ బ్యాంకుకు మార్పు చేసి అక్కడి నుంచి వివిధ ఖాతాలకు బదిలీ చేశారని తెలిపారు. యూనియన్ బ్యాంకు జాతీయబ్యాంకు అయినందున కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోకి వస్తుందన్నారు. దర్యాప్తు సాగుతుండగా బీజేపీ నాయకులు పనిగట్టుకుని తనను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో కార్పొరేషన్‌లలో అవినీతి జరిగిందని ఆరోపించారు. డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు పలువురు మంత్రులు ఉన్నారు.


మీడియాతో సీఎం సిద్దరామయ్య

లోకాయుక్త మెరుపు దాడులు

- రాష్ట్రంలో 13 మంది అధికారుల ఇళ్లలో సోదాలు
- కిలోలకొద్దీ బంగారం, రూ.కోట్ల ఆస్తుల గుర్తింపు

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, అధికారులపై లోకాయుక్త అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా మెరుపుదాడులు నిర్వహించారు. వారం కిందటే దాడులు చేసి బెంబేలెత్తించిన అధికారులు మరోసారి కార్యాచరణ కొనసాగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది అధికారులపై 54 ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఏకకాలంలో దాడులు చేశారు. ఇన్వెస్ట్ కర్ణాటక ఫోరం సీఈఓ సీటీ ముద్దుకుమార్, యాదగిరి జిల్లా జడ్పీ ప్లానింగ్ డైరెక్టర్ బలవంత్, దొడ్డబళ్లాపుర తాలూకా పశువైద్యాధికారి ఆర్. సిద్దరప్ప, హెబ్బగూడి సీఎంసీ కమిషనర్ నరసింహమూర్తి, కేఐఏడీబీ బెంగళూరు ఫస్ట్‌గ్రేడ్ క్లర్క్ టీవీ రాజా, వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బెంగళూరు రమేశ్ కుమార్, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ అత్తర్ అలి, భద్రావతి తాలూకా అంతరగంగె సర్పంచ్ నాగేశ్.బి, శివమొగ్గ ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాశ్, మండ్య కార్మికశాఖ అధికారి చేతన్‌కుమార్, బెంగళూరు ఉత్తర ఫస్ట్‌గ్రేడ్ క్లర్క్ మంజునాథ్ టి.ఆర్‌పై దాడులు నిర్వహించారు. బెంగళూరు లీగల్ మెట్రాలజీ అధికారి అత్తర్ అలి నివాసంపై దాడి చేసిన సమయంలో రెండున్నర కిలోల బంగారం, వెండి, లగ్జరీ వాచీలను ఓ బ్యాగులో వేసి పక్కన పడేయడంతో గుర్తించినట్టు లోకాయుక్త ఎస్పీ వంశీకృష్ణ తెలిపారు. అవినీతి అధికారులపై దాడిలో కిలోలకొద్దీ బంగారం, కోట్లాదిరూపాయల ఆస్తులు గుర్తించినట్టు అధికారులు తెలిపారు. వాటి పూర్తి వివరాలను లెక్కిస్తున్నామని, ప్రకటిస్తామని పేర్కొన్నారు.


దాడుల్లో భారీగా స్వాధీనం చేసుకున్న నగలు, నగదు ఖరీదైన వస్తువులు

ప్రాణాలు తీసిన మద్యం మత్తు

- పట్టాలపై పడుకున్న యువకులు
- రైలు వెళ్లడంతో ముగ్గురి దుర్మరణం

బళ్లారి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురూ మంచి మిత్రులు. వారిలో ఒకరిది పుట్టినరోజు. కలిసి సరదాగా బయటకు వెళ్లారు. ఆ తరువాత మద్యం దుకాణానికి వెళ్లి బీరు బాటిళ్లు తెచ్చుకున్నారు. రైలు పట్టాలపై కూర్చుని మద్యం సేవించారు. ఆ తరువాత పట్టాలపై తలవాల్చి.. సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ.. నిద్రలోకి జారుకున్నారు. మద్యం మత్తులో తాము ఎక్కడున్నామో మరిచిపోయారు. కాసేపటి తరువాత ఆ పట్టాల మీదుగా రైలు దూసుకుపోయింది. ముగ్గురి తలలు శరీరం నుంచి వేరయ్యాయి. ఈ విషాద ఘటన హుబ్లీ రైల్వే డివిజన్‌లోని కొప్పళ జిల్లా గంగావతి వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గంగావతి హిరేజంత్ కాలనీకి చెందిన మౌనేష్ పట్టర(23), సునీల్(23), వెంకట భీమానాయక్ (20) అనే ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మౌనేష్ పుట్టిన రోజు కావడంతో స్నేహితులు ముగ్గురూ బయటకు వెళ్లి.. ప్రాణాలు కోల్పోయారు. సునీల్, మౌనేష్ బీటెక్ చదువుతున్నారు. భీమానాయక్ ఇంటర్ పూర్తి చేసుకుని, ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నాడు. చేతికొచ్చిన కొడుకులు ఇలా ఊహించలేని విధంగా ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బంధుమిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. దక్షిణమధ్య రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మౌనేష్ పట్టర్ | సునీల్ | వెంకట భీమానాయక్

జలాశయాలు కళకళ


తుంగభద్రలో పెరిగిన నీటి మట్టం

- 118 అడుగులకు చేరిన కేఆర్‌ఎస్
- నిండుకుండలా తుంగభద్ర
- రైతుల్లో ఆనందోత్సాహం

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధమైన పెద్ద జలాశయం కేఆర్‌ఎస్‌కు శుక్రవారం సాయంత్రానికి 118 అడుగులకు నీటిమట్టం చేరింది. కేఆర్‌ఎస్ గరిష్ట మట్టం 124.80 అడుగులుగా ఉంది. మరో 6 అడుగులు మాత్రమే సంపూర్ణ భర్తీకి మిగిలింది. 46,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2,707 క్యూసెక్కులు అవుట్‌ఫ్లోగా ఉంది. 49 టీఎంసీల గరిష్ట లక్ష్యంలో 40 టీఎంసీలు చేరింది. గత ఏడాది ఇదే రోజునాటికి 89.90 అడుగుల లక్ష్యంలో కేవలం 15.81 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. 120 అడుగుల స్థాయికి నీరు చేరితే జలాశయం సురక్షితం దృష్ట్యా కేఆర్‌ఎస్ నుంచి లక్ష క్యూసెక్కులను విడుదల చేస్తారు. శ్రీరంగపట్టణ తాలూకాలో 53, పాండవపురలో 15, మలవళ్లిలో 21తోపాటు హేమావతి జలాశయానికి సంబంధించిన లోతట్టు ప్రాంతాలు, కేఆర్‌పేటలో 3 గ్రామాలకు సమస్య ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు సంబంధిత గ్రామాలకు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. జిల్లా, తాలూకా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించారు. కాగా కేరళతోపాటు కావేరి తీర ప్రాంతాల్లో వర్షబీభత్సం కొనసాగుతుండడంతో మరింత అప్రమత్తత అవసరమని అధికారులు హెచ్చరిస్తున్నారు. కేఆర్‌ఎస్‌లో నీటి సామర్థ్యం పెరుగుతుండడంతో మండ్య రైతులలో హర్షం వ్యక్తమవుతోంది.

నిండుకుండలా తుంగభద్ర

కంప్లి, జూలై 19 : తుంగభద్ర జలాశయంలోకి రోజురోజుకు ఇన్‌ఫ్లో ఎక్కువై నిండుకుండలా మారుతోంది. జలాశయంలో అత్యధిక ఇన్‌ఫ్లో వుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి 1,08,326 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 59.056 టీఎంసీలు నీరు జలాశయంలో చేరాయి. జలాశయం పైభాగంలోని తుంగ, భద్ర జలాశయాలు నిండి, తీర్థహళ్లి, కొడుగు, మలనాడు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం వుండటంతో అనుకున్న స్థాయికన్నా ఎక్కువగా నీరు చేరుతోంది. ఇప్పటికే రైతన్నలు నాట్లు వేసేందుకు సంసిద్ధులయ్యారు. తుంగభద్ర కాలువ నుంచి సాగునీరు కూడా విడుదల చేశారు. హెచ్చెల్సీ ఎల్ఎల్‌సీ కాలువలకు కూడా జలాశయం నుంచి సాగునీరు విడుదల చేశారు.



కేఆర్‌ఎస్ జలాశయం నుంచి విడుదల చేసిన నీరు


విధానసౌధ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో బీజేపీ నిరసన

కాంగ్రెస్ పాలన అవినీతిమయం

- ప్రతి పనికి పర్సంటేజీ
- ప్రతి హోదాకు రేట్‌కార్డ్
- విధానసౌధ గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నిరసన

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పదమే లేదని, అవినీతిదే ఆధిక్యమని, ప్రతిపనికి పర్సంటేజ్, ప్రతి హోదాకు రేట్‌కార్డ్ ఫిక్స్ చేశారని బీజేపీ ఆరోపించింది. శుక్రవారం విధానసౌధ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బీజేపీ శాసనసభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు సీటీ రవి మాట్లాడుతూ పారదర్శక పాలన లేదని, అవినీతి పాలన సాగుతోందన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవనంలో నల్లమచ్చ లేదని, కానీ పాలన అంతా అవినీతేనని సీఎంను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో రేట్ కార్డ్‌లంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కులంకార్డు ఉంటే 10 శాతం తగ్గిస్తారని, లేదంటే రేట్‌కార్డ్‌కు తగ్గట్టుగా ముట్టచెప్పాల్సిందే అన్నారు. బెంగళూరు నగరాభివృద్ధిశాఖలో ఎకరా భూమి పరివర్తనకు రూ.27 లక్షలుగా నిర్ధారించారని ఆరోపించారు. కోరుకున్న చోటుకు బదిలీ కోసం పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు రూ.50లక్షల నుంచి కోటి రూపాయలు, ఏసీపీకి కోటిన్నర నుంచి రూ.2కోట్లు, ఇంజనీర్లు, ఏఈఈలకు రూ.25 నుంచి 50 లక్షలు, ఈఈలకు రూ.50-75 లక్షలు, సీఈలకు కోటి నుంచి రూ.5కోట్లుగా నిర్ధారించారని ఆరోపించారు. సబ్‌రిజిస్ట్రార్, ఆర్టీఓలకు హోల్‌సేల్ వ్యాపారమని, రెవెన్యూలో తహసీల్దార్‌కు ప్రాంతాన్నిబట్టి రూ. 50లక్షల నుంచి కోటి రూపాయల దాకా ఉందన్నారు. అబ్కారీలో ఏసీకి రూ.5-7కోట్ల ధర పలుకుతోందని ప్లకార్డులను ప్రదర్శించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1618.03	1,590.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1, 06,723	9849
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	404	259
సామర్థ్యం (టీఎంసీలు)	55.97	11.77

రేపట్నుంచి చాతుర్మాస్య వ్రతం



సచ్చిదానంద సరస్వతి

బళ్లారి సిటీ, జూలై 19: నగరంలోని బాలాంజనేయ స్వామి మఠంలో ఈనెల 21 నుంచి శీహరిహరపుర శంకరాచార్యస్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి చాతుర్మాస్యవ్రతం పాటించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లుచేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఇందుకోసం శంకరాచార్య స్వామీజీ శనివారం పుర ప్రవేశం చేయనున్నారు. నగరంలోని దుర్గమ్మ దేవాలయం నుంచి శోభయాత్ర సాయంత్రం బాలాంజనేయ స్వామి మఠాన్ని చేరుకుంటుంది. 21న గురుపూర్ణిమ సందర్భంగా వ్రతం ప్రారంభించనున్నారు. శనివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. నగర ప్రజలు, భక్తాదులు పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

ఆషాఢ గాలుల ఎఫెక్ట్...

విరిగిన విండ్ టర్బైన్



విరిగి పడిపోయిన విండ్ టర్బైన్

బళ్లారి సిటీ,జూలై 19: సండూరు తాలూకా కొంగేరి గ్రామపంచాయితీ పరిధిలోని హీరాల్ గ్రామ భూమిలో జేఎస్‌డబ్ల్యూ కంపెనీకి చెందిన విండ్ టర్బైన్ శుక్రవారం కూలిపోయింది. రామాంజనేయశెట్టి పొలంలో విండ్ టర్బైన్ బిగించారు. అయితే ఈదురుగాలుల కారణంగా అది పక్కనే ఉన్న వీరభద్రప్ప పొలంలో విరిగిపడిపోయింది. దీంతో మొక్కజొన్న పంట దెబ్బతింది. ఈ సంఘటనతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. పొలాల్లో భయంతో వ్యవసాయ పనులు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల అగ్రహారం గ్రామపంచాయితీ పరిధిలో కూడా ఓ ఫ్యాన్ విరిగిపోయింది. చోరనూర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

కూలిన మొబైల్ టవర్



దరూరు గ్రామంలో కూలిన మొబైల్ టవర్...

బళ్లారి గాంధీనగర్, జూలై 19: జిల్లాపరిధిలోని తెక్కకోట ఫిర్కా పరిధిలోని దరూరు గ్రామంలో గురువారం సాయంత్రం కురిసిన భారీవర్షం, ఈదురు గాలుల తాకిడికి గ్రామ శివారులో నిర్మించిన బృహత్ మొబైల్ టవర్ కూలిపోయింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. టవర్ క్లాక్ సమీపంలోని డబ్బా అంగళ్ళపై ఇది కూలడంలో డబ్బా అంగళ్ళు నుజ్జునుజ్జయ్యాయి.

ఆసుపత్రిని పరిశీలించిన బాలల కమిషన్ సభ్యుడు



చిన్నారితో మాట్లాడుతున్న శశిధర్ కోసుంబే

బళ్లారి సిటీ, జూలై 19: బాలల కమిషన్ సభ్యుడు శశిధర్ కోసంబే శుక్రవారం విమ్స్, జిల్లా ఆసుపత్రిని సందర్శించి తనిఖీ నిర్వహించారు. చిల్డ్రన్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ని సందర్శించి అక్కడ గజిబిజిని చూసి వైద్యుడితో ఇక్కడ ఇబ్బందులను సరిదిద్దాలని హెచ్చరించారు. అనంతరం కొద్దిసేపటికే పరిస్థితి కొంత మెరుగుపడటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆరోగ్య అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపన్నులకందని అన్నభాగ్య



దాడుల్లో అధికారులు స్వాధీనంచేసుకున్న బియ్యం

● కర్ణాటక, మహారాష్ట్రలోని మిల్లులకు తరలిస్తున్న దళారులు

బళ్లారి సిటీ, జూలై 19: నిరుపేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నభాగ్య' పథకానికి సంబంధించిన బియ్యాన్ని ప్రజల నుంచి అక్రమంగా సేకరిస్తున్న ఖదీమ్‌లు కర్ణాటక, మహారాష్ట్రలోని మిల్లులకు తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని బీపీఎల్ కుటుంబాల లబ్ధిదారునికి 5కిలోలు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. బళ్లారి జిల్లాలో దాదాపు 2.69లక్షల(2.69.134)అన్నభాగ్య లబ్ధిదారులు ఉన్నారు. ఇదే సమయంలో అక్రమంగా బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు విక్రయించే గ్రూపులు కూడా చురుకుగా పనిచేస్తున్నాయి. ప్రతి తాలూకాలో ఏజెంట్లు, గ్రూపులు పేదల నుంచి కిలోకు రూ.10నుంచి 12రూపాయలు చెల్లించి బియ్యం సేకరిస్తున్నారు. గంగావతి, భద్రావతి, చెళ్లకెర, తుమకూరు నుంచి మహారాష్ట్రలోని మిల్లులకు రవాణా చేస్తారు. ఆ మిల్లులు బియ్యాన్ని పాలిష్ చేసి అందులో నాణ్యమైన బియ్యాన్ని కలిపి ఎక్కువధరకు విక్రయిస్తున్నారని ఆహార, పోలీసు శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. మిల్లుల నుంచి స్మగ్లర్లకు కేజీ బియ్యం రూ.25 కు అందిస్తున్నారు. ఇందులో ఆహారశాఖకు 50పైసలు, పోలీసు డిపార్ట్‌మెంట్‌కు రూ.2, మామూళ్లుగా ఇస్తున్నట్లు తెలుస్తోంది. మిల్లర్లు ఈ బియ్యంలో మంచి బియ్యాన్ని కలిపి కిలో రూ.50-60 చొప్పున విక్రయిస్తున్నారు. గంగావతి, సిరుగుప్పలో పండే సోనామసూరి బియ్యానికి మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. అన్నభాగ్య బియ్యంలో వీటిని కలిపి సోనామసూరిగానే విక్రయిస్తున్నారు. పోలీసు శాఖ అధికారులు కూడా ఈనెట్‌వర్క్‌లో పాలుపంచుకుంటున్నారు. సమస్యను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించక పోవడంతో వారికి రాజకీయనాయకుల మద్దతు కూడా లభిస్తోంది.

పెద్దల నుంచి కాల్స్: డీడీ సకీనా

దీనిపై ఆహార శాఖ డిప్యూటీ డైరెక్టర్ సకీనా మాట్లాడుతూ, బళ్లారిలో పేదల నుంచి సేకరించిన బియ్యాన్ని మాన్వి, లింగసుగూర్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఉందని, శాఖాపరమైన దాడులు చేసి, కేసులు నమోదు చేస్తామని, అయితే అక్రమార్కుల నెట్‌వర్క్ యాక్టివ్‌గా ఉందన్నారు.. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాలు పట్టుబడిన వెంటనే విఐపీల నుంచి ఫోన్లు వస్తాయంటున్నారు. దీంతో అక్రమార్కులను తాము ఏమీ చేయలేకపోతున్నామని వాపోయారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు

సిరుగుప్ప, జూలై 19: ఆషాఢ శుక్రవారం సందర్భంగా తాయమ్మదేవికి కన్నుల పండువగా పూజలు చేశారు. ప్రధాన అర్చకులు ప్రవీణ్ అమ్మవారికి ప్రత్యేకాలంకరణ నిర్వహించారు. పుష్పాలంకరణ సేవ, ఆకు పూజ, తదితర ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులుతీరారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేపట్టారు.

టీచర్‌గా మారిన కలెక్టర్!



పింజర్ హెగ్డాల్ గ్రామంలోని హైస్కూలులో పిల్లలకు విద్యాబోధన చేస్తున్న కలెక్టర్

కంప్లి, జూలై 19: విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ హగరి, బొమ్మనహళ్లి, తాలుకా పరిధిలోని పింజర హెగ్డాల్ హైస్కూలులో సైన్స్ టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. దీంతో ఆ తరగతి పిల్లలు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న పరీక్షలను దీటుగా ఎదుర్కొని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. ప్రస్తుత కాలంలో విద్యకన్నా మరేదీ గొప్పది కాదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పి ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. అలాగే పాఠశాలలో వుండే ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల మాదిరిగా అన్ని సౌకర్యాలు వుండేలా ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసంలో రాణించేలా చూడాలని సూచించారు.

రైతును అవమానించిన మాల్‌పై చర్యలకు డిమాండ్



మాల్ యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని నిరసన చేపట్టిన దృశ్యం

కంప్లి, జూలై 19: ధోవతి కట్టుకున్నారనే నెపంతో రైతును అవమానించిన బెంగళూరులో జీటీ వరల్డ్ మాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కురుగోడు పట్టణ ఏఐకేకేఎంఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐకేకేఎంఎస్ నేత గోవిందు మాట్లాడుతూ దేశంలో ఒక రైతు, సైనికుడు ఎంతో గుర్తింపు గల వ్యక్తులని, అలాంటిది జీటీ వరల్డ్ మాల్‌లో రైతు పక్కీరప్పను ధోవతి కట్టుకున్నాడని వెనక్కు తిప్పిపంపడం తగదన్నారు. ప్రజాస్వామ్యంలో రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. అవమానపడ్డ రైతుకు క్షమాపణ చెప్పి మాల్‌ను పూర్తిగా మూసివేయాలని కోరారు. బెంగళూరులో ఆ మాల్‌కు విరుద్ధంగా పోరాటం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గురల్లి రాజా, కోళూరు పంపాపతి, ఖాసీమ్ సాబ్, కలకంబ్ల పంపాపతి, వన్నూరప్ప, విరుపాక్షి, పరమేష్ పాల్గొన్నారు.

రుద్రభూమి రహదారికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మేయర్ ముల్లంగి నందీష్

బళ్లారిరూరల్, జూలై 19: బళ్లారి కౌల్ బజార్ ప్రాంతంలో గల రోమన్ క్యాథలిక్ రుద్ర భూమి రహదారికి బళ్లారి మేయర్ ముల్లంగి నందీష్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రూ.25 లక్షల ఎంపీ నాసిర్ హుస్సేన్ నిధులతో మేయర్ ముల్లంగి నందీష్ ఈ కార్యక్రమం చేపట్టారు. మహానగరపాలిక కార్పొరేటు కాంగ్రెస్ ప్రముఖులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న పంచాయతీ అధ్యక్షురాలు

కంప్లి, జూలై 19: దేవలాపురం ప్రభుత్వ పాఠశాలలో పేద కుటుంబాలకు చెందిన 40 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులే ముందుకొచ్చి మహమ్మద్ సోఫియల్, గీతలు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఈరమ్మ మాట్లాడుతూ.. పాఠశాలలకే సక్రమంగా వెళ్లక, బోధన సక్రమంగా లేని పాఠశాలలు ఎన్నో వున్నాయని, అలాంటిది తమగ్రామంలో పేద విద్యార్థులను గుర్తించి సుమారు 40 మంది విద్యార్థులకు రూ. 15 వేలకు పైగా ఖర్చుతో పాఠశాల బ్యాగులు ఉచితంగా పంపిణీ చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయులు మహమ్మద్ సోఫియల్, గీతలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారితోపాటు ఎస్‌డీఎంసీ అధ్యక్షులు కోరి నాగేష్, సోమశేఖర్, నాగరాజు, బసవరాజు, బ్రహ్మానంద, గౌతమ్, ఉమేష్, విరుపాక్షి, జ్యోతి, గిరిజ, రాగశ్రీ, కవిత, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్, శాంతిభద్రతలపై చర్యలు: ఎస్పీ



జిల్లా ఎస్పీని సత్కరిస్తున్న రాఘవ స్మారక సమితి

బళ్లారి సిటీ, జూలై 19: బళ్లారి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శోభరాణిని బళ్లారి రాఘవస్మారక సమితి గౌరవాధ్యక్షుడు కే.చెన్నప్ప, అధ్యక్షుడు కోటేశ్వర రావు, కార్యదర్శి ప్రకాశ్, సభ్యులు గురువారం సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నగరంలో బెంగళూరు రహదారి, కాళమ్మవీధి, తేరువీధి, గడిగి చెన్నప్ప సర్కిల్, దుర్గమ్మ గుడి, ఇందిరా సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా ఆటోలు, ప్రైవేట్ బస్సులు రహదారిపై పార్కింగ్ చేయడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. త్వరలో వాటికి చెక్‌పెడతానన్నారు. ఈ సందర్భంగా సభ్యులు రామాంజనేయులు, కే.కృష్ణ, తిమ్మప్పచౌదరి, రమణప్ప భజంత్రీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విచారణ

● వాల్మీకి కార్పొరేషన్ అవినీతిపై

రాయచూరు రూరల్ ఎమ్మెల్యేను విచారించిన ఈడీ



రాయచూరు, జూలై 19: కర్ణాటక వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతి వ్యవహారంతో పాటు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలపై ఈడీ చేపట్టిన విచారణ కొనసాగుతోంది. వాల్మీకి అభివృద్ధి మండలి ఛైర్మన్‌గా ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడకు ఇప్పటికే రెండు సార్లు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేయగా ఎమ్మెల్యే విచారణకు గైర్హాజరయ్యారు. మూడవ సారి ఈ నెల 18వ తేదీన జారీ చేసిన నోటీసుకు ఆయన స్పందించి విచారణకు హాజరు కాగా తొలి రోజు నిర్విరామంగా ఏడు గంటల పాటు ఆయనను ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. కార్పొరేషన్ ద్వార విడుదలైన నిధులు ఇతర అవసరాలకు మళ్లించడంతో పాటు ఆస్తుల వ్యవహారానికి సంబంధించి అధికారులు రూరల్ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అంతకుపూర్వం మూడు రోజుల పాటు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే నివాసంలోను ఆయన సమీప బంధువుల ఇళ్లల్లోను సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు వాటికి సంబంధించిన వివరాలపై ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కాగా విచారణ మరో రోజు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణకు రూరల్ ఎమ్మెల్యేతో పాటు ఆయన సమీప బంధులకు పొలం అమ్మిన లక్ష్మీదేవమ్మ అనే రైతును కూడా ఈడీ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.

కన్నడిగుల రిజర్వేషన్లను కొనసాగించాలి

రాయచూరు, జూలై 19: కార్పొరేట్ కంపెనీల్లో కన్నడిగులకు రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కర్ణాటక రక్షణ వేదిక నాయకులు కోరారు. ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తలొగ్గి సిద్ధం చేసిన రిజర్వేషన్ బిల్లును వాయిదా వేయడం సముచితం కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రైవేటు ఒత్తుడికి తలొగ్గకుండా వెంటనే నిర్ణయాన్ని అమలు చేయాలని కోరారు. వాయిదా వేయాలని తీసుకున్న ప్రభుత్వం నిర్ణయాన్ని నిరశిస్తు శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేసిన కరవే నాయకులు జిల్లాధికారి ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చారు.



డీసీ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న కరవే నాయకులు

హోసూరు జోన్

క్యాబేజీకి వింత తెగులు: తగ్గిన దిగుబడి



వర్షాల కారణంగా తెగులు సోకిన క్యాబేజీ

హోసూరు, జూలై 19: క్యాబేజీకి కొత్త తెగులు సోకడంతో హోసూరు, పరిసర ప్రాంతాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీని కారణంగా పంట కొంత పెరగగానే బ్లాక్‌రాట్ లాంటి తెగుళ్లు సోకి పంటను తినివేస్తున్నాయి. దీంతో మిగిలిన పువ్వు రెక్కలు మాడిపోయి మార్కెట్‌కు పనికిరాకుండా పోతున్నాయి. హోసూరు, డెంకణీకోట, బాగలూరు, ఉద్దన్నపల్లి, ఆవలపల్లి, కెలమంగలం ప్రాంతాల్లో రైతులు తక్కువకాలంలోనే దిగుబడినిచ్చే బచ్చలికూర, క్యాబేజీ, క్యాలిఫ్లవర్, ముల్లంగి, తదితర పంటలుపండిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పండించిన కూరగాయలను బత్తలపల్లి కూరగాయల మార్కెట్‌కు తరలించి అక్కడి నుంచి తమిళనాడులోని వివిధ ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం వర్షం, చలి కారణంగా ఈ పరిసర ప్రాంతాల్లో క్యాబేజీకి ఒక రకమైన కొత్తవ్యాధి సోకడంతో దిగుబడి తగ్గిపోయింది. గత నెలలో కిలో రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయించిన క్యాబేజీకి ప్రస్తుతం వ్యాధి సోకడం కారణంగా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. ఏటా ఈ కాలంలో వ్యాధి సోకి పంట దిగుబడిపై ప్రభావం పడుతోంది. అందువలన క్యాబేజీ వ్యాధి బారిన పడకుండా వ్యవసాయ శాఖ సలహాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన పూల ధరలు

హోసూరు(సిఫ్‌కాట్), జూలై 19 : ఆడినెలను పురస్కరించుకుని పూల ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు పరిసర ప్రాంతాల్లో చాలా మంది రైతులు బంతిపూలు, గులాబీలు, పండిస్తుంటారు. ఈ సందర్భంగా తమిళుల ఆడి మాసం, కన్నడ, తెలుగువాళ్లకు ఆషాఢం ప్రారంభం కావడంతో అమ్మవారికి, సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. దీంతో మార్కెట్‌కు పూల రాక పెరిగింది. పూల ధరలు కూడా పెరిగాయి.

ప్రబలిన డెంగీ

హోసూరు, జూలై 19: తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో డెంగీ వేగంగా విస్తరిస్తోంది. హోసూరు ప్రాంతంలోనూ విజృంభిస్తోంది. ప్రస్తుతం హోసూరులో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం మారిపోయింది. దీంతో ప్రజలు జలుబు, జ్వరాలు, వంటి శారీరక వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముందుజాగ్రత్త చర్యగా హోసూరు ప్రభుత్వాసుపత్రిలో డెంగ్యూ జ్వరాల చికిత్సకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి దోమతెరలతో బెడ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్లేట్‌లెట్ కౌంట్‌ను గుర్తించేందుకు ఈ వార్డులో ప్రత్యేక పరికరాన్ని ఏర్పాటు చేశారు. దీంతో రోగులు రక్తపరీక్ష కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక వార్డులో ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలుసుకుని చికిత్స పొందేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఆరుగురు డెంగీతో చికిత్స పొందుతున్నారని, అందులో ఇద్దరు కోలుకున్నారని, మరో నలుగురు చికిత్స పొందుతున్నారని వైద్యులు తెలిపారు.



హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ చికిత్సకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

దర్వేష్ కంపెనీ యజమానిపై కేసు నమోదు చేయాలి





దర్వేష్ కంపెనీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డీఎస్ఎస్ నాయకులు

రాయచూరు, జూలై 19: అధిక వడ్డీ ఆశ చూపి పెద్ద ఎత్తున డిపాజిట్లు స్వీకరించి కనిపించకుండా పోయిన దర్వేష్ కంపెనీ యజమానిపై కేసు నమోదు చేయాలని అంబేడ్కర్‌సేన జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ పట్టి కోరారు. డిపాజిట్లు చేసిన వినియోగదారులతో కలిసి శుక్రవారం నగరంలోని రిమ్స్ ఆస్పత్రి వద్దనున్న దర్వేష్ కంపెనీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన విశ్వనాథ్ పట్టి, 12 నుంచి 17 శాతం వడ్డీ చెల్లిస్తామని పెద్దఎత్తున సొమ్మును డిపాజిట్ చేయించుకున్న దర్వేష్ కంపెనీ యజమాని సొమ్ము డిపాజిట్ చేసుకున్న మహ్మద్ శుజ నెలరోజుల నుంచి ఎవ్వరికి కనిపించకుండా పోవడమేగాక సెల్‌ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ చేశారని నగరంలోని మార్కెట్ యార్డ్ పోలీసులకు వివరించారు. డిపాజిట్‌చేసిన సొమ్ము కోట్లలో ఉండడంతో ఖాతాదారులు ఆందోళనలో ఉన్నారని వారికి న్యాయంజరిగేలా వెంటనే కేసు నమోదు చేయాలన్నారు.

రాయచూరు ఎంపీకి సీఎం, డీసీఎం అభినందన



ఎంపీ నాయక్‌ను అభినందిస్తున్న సీఎం, డీసీఎం

రాయచూరు, జూలై 19: ఎంపీగా ఎన్నికైన అనంతరం నియోజక వర్గంలో పర్యటించి అన్ని వర్గాల ప్రజలతో మమేకమై సమస్య గురించి అడిగి తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన రాయచూరు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్‌ను సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు అభినందించారు. బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశానికి హాజరైన కుమార్ నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించిన సీఎం, డీసీఎం రాయచూరు జిల్లాలో ఉన్న సమస్యలు వాటి పరిష్కారం కోసం తీసుకోవల్సిన చర్యలు తదితర అంశాల గురించి లోకసభలో లేవనెత్తాలని సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కవికొండల వెంకటరావు (జయంతి)



తొలితరం తెలుగు రచయితలలో ఒకరైన కవికొండల వెంకటరావు 1892 జూలై 20న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ప్రాంతంలోని శ్రీరంగపట్నంలో జన్మించారు. 300కుపైగా కథలు రాశారు. 1929లో పుస్తకరూపంలో వెలువడ్డాయి. మొదటిది 'పొట్టికత'. రెండు నవలలు, విజన సదనము, కోనసీమ సాంఘిక నవల 'ఇనుపకోట', ఇంకా చదువుల దుత్త, చిట్టి కైత తదితర ఖండకావ్య సంపుటాలు రాశారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితోరాసిన దేశభక్తి గేయాలు 'మాతృదేశ సంకీర్తనము' పేరిట వెలువడింది. ఆయన కథలు పలు పత్రికలలో పోటాపోటీగా ప్రచురితమయ్యాయి. 1969 జూలై 4న దివంగతులయ్యారు.

శారదాదేవి (వర్ధంతి)




శారదాదేవి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస భార్య యోగిని, శారదామాతగా పేరొందారు. 1853 డిసెంబరు 22న పశ్చిమబెంగాల్ రాష్ట్రం జయరాంబాటిలో జన్మించారు. శిష్యులు ఆమెను హోలీమదర్, శ్రీ మా అని సంబోధించేవారు. ఈవిడను ఆదిశక్తి అవతారంగా భావిస్తారు. గురువు మరణం తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక సలహా, సందేహ నివృత్తికైనా శారదాదేవిని అడిగేవారు. 1920 జూలై 20న పరమపదించారు.

గుగ్లిఎల్మో మార్కోనీ (వర్ధంతి)



ఇటలీ దేశ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్ గుగ్లిఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ 1874 ఏప్రిల్ 25న జన్మించారు. సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపేందుకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పితామహుడిగా గుర్తింపు పొందారు. కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్‌తో కలసి వైర్‌లెస్ టెలిగ్రాఫీపై భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1937 జూలై 20న కన్నుమూశారు.

నసీరుద్దీన్ షా (పుట్టినరోజు)



పద్మభూషణ్ పురస్కార గ్రహీత నసీరుద్దీన్ షా 1950 జూలై 20న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బారాబంకీలో జన్మించారు. నాటకరంగంలోనూ, వెండితెరపైన నటుడిగా, దర్శకుడిగా పేరొందారు. బాలీవుడ్‌లో రాణించారు. ఐదు జాతీయ అవార్డులు, 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. కర్మ, మీర్జా గాలిబ్, ది పెర్ ఫెక్ట్ మర్డర్, సర్ఫరోష్, ది లీగ్ ఆఫ్ ఎక్స్‌ట్రార్డినరీ జెంటిల్‌మెన్ సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర పుర స్కారాలు అందుకున్నారు.

అరుణిమ సిన్హా (పుట్టినరోజు)



ప్రపంచంలోని అత్యున్నత శిఖరం ఎవరెస్టును అధిరోహించిన దివ్యాంగ మహిళ అరుణిమ సిన్హా 1988 జూలై 20న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అంబేడ్కర్ నగర్ ప్రాంతంలో జన్మించారు. దుండగుల దురాగతంలో కుడికాలు పోగొట్టుకున్న జాతీయస్థాయి వాలీబాల్ మాజీ క్రీడాకారిణి. తన 25వ యేట ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇతర పర్వతాలను కూడా అధిరోహించారు. 'బోర్న్ అగైన్ ఆన్ ది మౌంటైన్' అనే పుస్తకాన్ని రాయగా ప్రధాని మోదీ ఆవిష్కరించారు. పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

కైవారలో గురుపూజా సంగీతోత్సవం ప్రారంభం

చింతామణి, జూలై 19: తాలూకాలోని కైవార యోగి నారేయణమఠంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని మూడు రోజుల గురుపూజా సంగీతోత్సవం శుక్రవారం ఆ రంభమైంది. సుప్రభాతం, గోపూజ, సద్గురు పూజలతో ఉత్సవాన్ని ఆరంభించారు. మఠం ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలు, పండ్లతో అలంకరించారు. మంగళ వాయి ద్యాలతో గోపూజ అనంతరం తాతయ్య ప్రథమ దర్శనపూజ నిర్వహించారు. అలంకరించిన పల్లకీలో సద్గురు తాతయ్య దేవాలయం నుంచి మంగళవాయిద్యాలతో సంగీత సభాం గణానికి తీసుకెళ్లారు. మూడు రోజుల గురుపూజా సంగీతో త్సవాన్ని ఆలయ ధర్మాధికారి ఎంఆర్ జయరాం ప్రారంభించారు. ధర్మాధికారి సంకీర్తన అనంతరం చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాల విద్వాంసులచే సంగీతాన్ని సమర్పించారు. స్థానిక కళాకారుల నాదస్వరం, వేణువుబృందం సంగీతం సాగింది. యోగి నారేయణ సభాంగణంలో సంగీత కచేరీకి వీలు కల్పించారు. భారీ వేదికను రూపొందించారు. వేదికను రెండు గా విభజించారు. మధ్యాహ్నం సంగీత కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డి.వి.వెంకటేశ్, ఎం గాయత్రి, లీలా లక్ష్మినారాయణ్, కైవార రామణ్ణ తదితరుల బృందం సంగీతాన్ని అందించారు. సాయంత్రం ప్రత్యేక కార్యక్రమంలో పి.జె. బ్రహ్మచారి బృందంచే సోలో ఫిడేలు, అదితి ప్రహ్లాద్, వినయ్ శర్మ, లక్ష్మీ హోసూరు, డీఆర్ రాజ ప్ప, కోలారు బృందంచే సంగీత ప్రదర్శన, భవ్యమంజునాథ్ బృందం చే భరతనాట్య ప్రదర్శన సాగింది.



ఎంఆర్ జయరాం కైవార ధర్మాధికారిఎసంగం



కైవార నారేయణ తాతయ్య మూలవిరాట్టు

మయోపియాపై చైతన్యం కోసం మారథాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నారాయణ నేత్రాలయ ఆసుపత్రి చైర్మన్ రోహిత్‌శెట్టి తదితరులు

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మయోపియా (హ్రస్వదృష్టి) సమస్యపై ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈనెల 28న మారథాన్ నిర్వహిస్తున్నట్టు నారాయణ నేత్రాలయ ఆసుపత్రి చైర్మన్ రోహిత్‌శెట్టి తెలిపారు. రాజాజినగర్‌లోని నారాయణ నేత్రాలయలో మీడియాతో మాట్లాడుతూ హ్రస్వదృష్టిపై అవగాహన కల్పించాలని మారతాన్ ఏర్పాటు చేశామన్నారు. 2050 నాటికి 50శాతంమందిపై ప్రభావం చూపనుందన్నారు. ప్రస్తుతం నలుగురు పిల్లల్లో ఒకరికి మయోపియా వేధిస్తోందన్నారు. మయోపియా తీవ్రతమైతే కంటిపొర రెటీనాపై సమస్యలు, గ్లూకోమా వంటి ప్రమాదాలు కారణమవుతాయన్నారు. ఇటీవలికాలంలో చిన్నారులు మొబైల్, టీవీ, కంప్యూటర్ స్క్రీన్‌లకు బానిసలుగా మారారని బయట ఆడుకునేందుకు వెళ్లడం లేదన్నారు. ప్రజల్లో అవగాహన తీసుకురావాలని మారథాన్ నిర్వహిస్తున్నామన్నారు. 1.50 కిలోమీటర్ల మారథాన్, మ్యాజిక్ షో, ఫేస్ పెయింటింగ్, జానపద ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉదయం 7.30 గంటలనుంచి 11వరకు ఎంజీ రోడ్డులోని రాజేంద్రసింగ్ జీ మిలిటరీ అధికారుల సంస్థ ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నారాయణ నేత్రాలయ సీఈఓ ఎస్‌కే మిత్తల్, వైద్యనిపుణురాలు డాక్టర్ మైత్రి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబాకు వైభవంగా పుష్పాభిషేకం

▸▸ గురుపూర్ణిమకు ఏర్పాట్లు

బొమ్మనహళ్ళి, జూలై 19: అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన షిర్డీసాయిబాబాకు గురు పూర్ణిమను పురస్కరించుకుని విశేష పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ ఏర్పాటై 15 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా గురువారం సుమారు 450 కేజీలతో వివిధ రకాల పుష్పాలతో అభిషేకించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అవకాశం కల్పించారు. స్వయంగా స్వామివారికి అభిషేకం చేసే అవకాశం లభించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం, పర్వదినాలలో స్వామివారికి జలాభిషేకం, క్షీరాభిషేకం అవకాశం కల్పిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ కమిటీ సమాజ సేవలు అభినందనీయమని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు. మెరిట్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఫీజులు కల్పించామని ఇదంతా భక్తుల సహాయ సహకారాలతోనే సాధ్యమైందని ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ వెల్లడించారు. గురుపూర్ణిమకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కాగడ హారతి, మధ్యాహ్న హారతి, శేజ్ హారతి ఉంటాయన్నారు. రాత్రి 10 గంటల వరకు దర్శనం సదుపాయం ఉంటుందని, ప్రసాద వినియోగం కలదన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తాతయ్యగుప్త, కృష్ణయ్యశెట్టి, మనోహర్‌గుప్త, వెంకటేశ్‌గుప్త, వినయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురుపూర్ణిమ రోజున అన్నదానం కోసం కాంగ్రెస్ నాయకుడు లోకేశ్‌రెడ్డి 27 బస్తాల బియ్యం, ఇతర వంటసామగ్రి సమకూర్చారన్నారు.



పుష్పాభిషేకంలో పాల్గొన్న భక్తులు



బియ్యం బస్తాలు, ఇతరత్రా విరాళంలో దాతలు, ఆలయ కమిటీ సభ్యులు

అలరించిన జేసీఐ సంగీత విభావరి

విజయపుర, జూలై 19: లక్ష్మీవెంకటరమణ బ్రహ్మరథోత్సవం పురస్కరించుకుని సీనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ విజయపుర లీజన్, అండ్ జేసీఐ సంగీత విభావరి, పురస్కారాల ప్రదానం ఆకట్టుకుంది. సీనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ఆషాడ తొలి ఏకాదశిని పురస్కరించుకుని రథోత్సవం జరిగిందన్నారు. విజయపుర లీజన్ ఆధ్వర్యంలో సంగీత విభావరి సభికులను అలరించింది. హైకోర్టు న్యాయవాది జగదీశ్ మాట్లాడుతూ దేవాలయాల నగరి విజయపురకు ధార్మిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలకు పేరొందడం సంతోషంగా ఉందన్నారు. సన్మానం స్వీకరించి ఎస్పై ప్రశాంత్ మాట్లాడుతూ బ్రిటీష్‌కాలం నాటి చట్టాల స్థానంలో కేంద్రం కొత్త చట్టాలు తెచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు అవసరమన్నారు. పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



పోలీసు అధికారి ఎస్ఎస్ ప్రశాంత్‌కు సన్మానం

కసాప సమ్మేళనం లోగో విడుదల

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విధానసౌధ బాంక్వెట్‌హాల్‌లో మండ్య జిల్లాలో జరిగే 87వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం లోగో, పోస్టర్‌లను శుక్రవారం సీఎం సిద్దరామయ్య లాంచనంగా విడుదల చేశారు. కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి, ఎమ్మెల్యేలు రమేశ్‌బాబు, బండి సిద్దేగౌడ, నరేంద్రస్వామి, ఉదయ్‌గౌడ, దినేశ్ గూళిగౌడ, కసాప రాష్ట్ర అధ్యక్షుడు నాడోజ మహేశ్‌జోషి, మండ్య జిల్లా అధికారి కుమార్, కన్నడ సంస్కృతిశాఖ డైరెక్టర్ ధరణీదేవి మాలగత్తి తదితరులు పాల్గొన్నారు.



కసాప సమ్మేళనం పోస్టర్ విడుదలలో సీఎం సిద్దరామయ్య తదితరులు

చెట్ల తొలగింపుపై స్థానికుల ఆగ్రహం



చెట్ల కొమ్మలు తొలగించిన తీరు ఇలా...

దొడ్డబళ్ళాపుర, జూలై 19: పర్యావరణంపై జాగృతి కల్పిస్తూ పచ్చదనం పెంపుకోసం పాటుపడిన అధికారులు ప్రస్తుతం లే అవుట్‌ల అభివృద్ధి కోసం చెట్లను తొలగించే ప్రక్రియ చేపట్టడంపై సర్వత్రా ఆక్రోశం వ్యక్తం అవుతోంది. కొవిడ్ వంటి క్లిష్ట సమయాల్లో ఆక్సిజన్ కోసం ఎంతో మంది ఇబ్బందిపడిన అంశాన్ని ప్రస్తావించారు. ఒక మొక్క నాటితే ఆ చెట్టు నుంచి వందలామంది ప్రజలకు ఆక్సిజన్ వస్తుందన్నారు. రోడ్డు పక్కన ఉన్న పదుల సంవత్సరాల చింత చెట్లను తొలగిస్తున్నారు. జాతీయ రహదారి 648పై దాబస్ పేట - దొడ్డబళ్ళాపుర మార్గంలో భారీ ప్రమాణంలో చింతచెట్లు ఉన్నాయి. స్థానికంగా లావణ్యస్కూల్ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. లే అవుట్‌కోసం వేసిన రోడ్డుకు చెట్లు అడ్డుగా ఉన్నాయి. అటవీశాఖ అనుమతి మేరకు 10 చెట్ల కొమ్మలు తొలగించేందుకు, రెండు చెట్లను పూర్తిగా తొలగించేందుకు వీలుందని అయితే నిబంధనలు ఉల్లంఘించారని పర్యావరణ ప్రేమి, యువ నాయకుడు చిదానంద్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ తీగలు తగుతులున్నాయని చెట్లకొమ్మలు తొలగించేందుకు అనుమతి కోరారని అయితే అమలులో మాత్రం అశాస్త్రీయంగా ఉందన్నారు. ఇష్టం వచ్చినట్టు కొమ్మలు నరికేశారని, జోరుగా ఈదురుగాలులు, వర్షం వస్తే చెట్లు కూలే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన వారు పాటించడం లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేల కోసం రిలాక్స్ సోఫాలు



సేద తీరుతున్న స్పీకర్ యూటీ ఖాదర్

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక సోఫాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వేళ ఎమ్మెల్యేలు కాసేపు సేద తీరేందుకు వీలుగా రిలాక్స్ సోఫాలను శుక్రవారం స్పీకర్ ప్రారంభించారు. సోఫాలలో ఎమ్మెల్యేలు నిద్రించేందుకు వీలుందని స్పీకర్ యూటీ ఖాదర్ తెలిపారు. శాసనసభ సమావేశాలలో ఎక్కువమంది సభ్యులు పాల్గొనేందుకు ఇటువంటి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కువమంది సభ్యులు కోరితే మరిన్ని రిక్లైనర్ సోఫాలను కల్పిస్తామన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగ సాధన

శిడ్లఘట్ట, జూలై 19: పోటీ యుగంలో వివిధ దశలను దాటి ఉద్యోగం పొందడం అంత సులభం కాదని నైపుణ్యం పెంచుకోవాల్సి ఉందని బీజేపీ నాకుడు సీకల్ రామచంద్రగౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని చీమంగల గ్రామంలో స్వామి వివేకానంద దివ్యాంగుల క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రామచంద్రన్, నారాయణస్వామిల స్మరణార్థం టైలరింగ్ తర్ఫీదు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వృత్తి మార్గదర్శనం కొరత, నైపుణ్యలేమి సమస్యలతో చాలామంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ దిశలో ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉన్నవారికి ఆయా వృత్తులవారికి మార్గదర్శనం, నైపుణ్యం కల్పించే కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా క్షేమాభివృద్ధి సంస్థకు కర్ణాటక బ్యాంకు ఉద్యోగి ప్రజ్వల, పారిశ్రామికవేత్త శంకర్ కుమార్తె మానసలు రెండు టైలరింగ్ మిషన్‌లను అందచేశారు. నైపుణ్యాన్ని కల్పించడంలో స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు సహకారం అందించాల్సి ఉందన్నారు. 2023-24లో ఎస్ఎస్ఎల్‌సీలో 80శాతానికిపైగా మార్కులు పొందిన 12మందికి ప్రోత్సాహధనం ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చీమంగల గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సరస్వతి, రూరల్ హోబళి బీజేపీ అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ, తాజా మాజీ అధ్యక్షుడు కంబదహళ్ళి సురేంద్ర గౌడ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేశ్, తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు, ముంబైలో కోవర్క్స్ శాఖలు

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రీమియం వర్క్‌స్పేస్ సమకూర్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్న కోవర్క్స్ సంస్థ బెంగళూరు, ముంబైలలో నాలుగు శాఖలను ఏర్పాటు చేసినట్టు బిజినెస్ హెడ్ పారుల్ రాకూర్ తెలిపారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎకో వరల్డ్, సెంటినియల్‌లో శాఖలు ప్రారంభించామన్నారు. తద్వారా దేశ వ్యాప్తంగా 15లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కంపెనీల ఏర్పాటుకు స్పేస్ సమకూర్చినట్టయ్యిందన్నారు. ఆధునిక శైలి, ఓపెన్ ప్లేస్, సహజసిద్ధతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కోవర్క్స్ ద్వారా స్టార్టప్‌లు, కంపెనీలు, యూనికార్న్‌లతో కలిపి 500కుపైగా సంస్థలకు స్థలం సమకూరుస్తోందన్నారు.

కేఎస్ఆర్టీసీ బస్సులు నడపండి

చేళూరు, జూలై 19: చింతామణి నుంచి కదిరి వయా ఏనిగదలె, చేళూరు, చాకవేలు, బిళ్ళూరు, ఓడీసీ మీదుగా కేఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని తాలూకా వాసులు కోరుతున్నారు. ఈ మార్గంలో మూడు ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు కనీసం రెండు అయినా నడిపి సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. చింతామణి నుంచి కదిరికి వెళ్లే వారు ఎక్కువగానే ఉంటారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం ఈ ప్రాంతవాసులు ఎక్కువగా వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ సర్వీసులు నడపాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ, విద్యార్థులకు అనుకూలంగా ఏసర్ స్టోర్

బెంగళూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు అనుకూలంగా ఉండాలని ఏసర్ ఎలక్ట్రానిక్స్ పరికరాల అత్యాధునిక స్టోర్‌ను తీసుకొచ్చామని ఎండీ హరీశ్ కోహ్లి వెల్లడించారు. నగరానికి తలమానికం అనిపిస్తున్న మాల్ ఆఫ్ ఏసియాలో ఏసర్ స్టోర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. తద్వారా 200 మైలురాయికి చేరామని 2025 నాటికి దేశ మంతటా 300 స్టోర్‌లు లక్ష్యమన్నారు. మాల్ ఆఫ్ ఏసియా స్టోర్‌తో బెంగళూరులో పదోశాఖను ఆరంభించినట్టయ్యిందన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, జూలై 19: ఏపీఎస్పీడీసీఎల్ అనంతపురం సర్కిల్ ఎస్ఈగా సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఆమేరకు శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు నియమక ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో అనంతపురం ట్రాన్స్‌ఫార్మర్స్ ఆపరేషన్ విభాగాల్లో పని చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈయనను తెలంగాణకు కేటాయించారు. సుప్రీకోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఏపీఎస్పీడీసీఎల్‌కు కేటాయించబడ్డారు. ప్రస్తుతం తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న సురేంద్రను తిరుపతి ప్రధాన కార్యాలయం లో రిపోర్ట్ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

రానున్న ఐదు రోజుల్లో వర్ష సూచన

బుక్కరాయసముద్రం, జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. పలు చోట్ల గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవ కాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయాన్ని సందర్శించిన గోవిందానంద సరస్వతి

అనంతపురం కల్చరల్, జూలై 19: కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బా లక్ష్మానంద మహాసంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి శుక్రవారం జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయాన్ని సందర్శించారు. ఈనెల 21 నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు చాతుర్మాస దీక్షలు చేపట్టేందుకు శ్రీశైలం వెళ్తున్న స్వామీజీ మార్గమధ్యలో కాశీవిశ్వేశ్వరాలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చక బృందం స్వామీజీకి స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, కిశోర్, హర్ష పాల్గొన్నారు.



కాశీవిశ్వేశ్వరాలయాన్ని సందర్శిస్తున్న గోవిందానంద సరస్వతి స్వామి

ర్యాగింగ్‌కు స్వస్తి పలకండి: న్యాయాధికారి

అనంతపురం క్రైం, జూలై 19: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ భవిష్యత్తును కోల్పోవద్దని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. రోడ్డు నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. ర్యాగింగ్ నిరోధక చట్టంలోని అంశాలను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భక్తవత్సలం, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యుడు, న్యాయవాది హరికృష్ణ, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికె నల్లప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్